గ్రామాల్లో సందడిగా 'నాభూమి - నా దేశం'

- ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు
- శిలాఫలకాల ఆవిష్కరణ, మాజీ సైనికులకు సన్మానం



మదనపల్లె : కురవంకలో మాజీ సైనికులను సన్మానిస్తున్న సర్పంచ్ చిప్పిలిచలపతి, వార్డు మెంబర్లు



కలికిరి : జాతీయ జెండాలు ప్రదర్శిస్తున్న జవానులు, అధికారులు

మదనపల్లె : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం నా భూమి -నాదేశం, నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం కార్యక్రమాలు సందడిగా మొదలయ్యాయి. మండలంలోని బొమ్మనచెరువు, దుబ్బిగానిపల్లె, కొత్తవారిపల్లె, కురవంక, పోతపోలు, పెంచుపాడు, పాన్నూటిపాళెం, మాలేపాడు, రామాచార్లపల్లె పంచాయతీల్లో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ్ లోగో, ప్రధానమంత్రి సూక్తి, స్థానిక వీరుల పేర్లు, పంచాయతీ పేరుతో ప్రత్యేకంగా తయారుచేయించిన శిలాఫలకాలను ఆయా పంచాయతీ సర్పంచులు ఆవిష్కరించారు. అనంతరం సెల్ఫీలు తీసుకుని ప్రత్యేక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. మట్టిని తీసుకుని పంచప్రాణ ప్రతిజ్ఞ చేశారు. సచివాలయాల ఆవరణలో వసుధకు వందనంలో భాగంగా మొక్కలు నాటారు. బొమ్మనచెరువు పంచాయతీలో సర్పంచ్ దండుకరుణాకర్‌రెడ్డి శిలాఫలాకాన్ని ఆవిష్కరించి... స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో సమరయోధులు ప్రాణత్యాగాలు చేసి సాధించిన స్వాతంత్ర్యం కారణంగానే నేడు దేశప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించగలుగుతున్నామన్నారు. వారి త్యాగాన్ని సదా స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కురవంకలో సర్పంచ్ చిప్పిలిచలపతి ఆధ్వర్యంలో మాజీ సైనికులు శివారెడ్డి తదితరులను ఘనంగా సన్మానించారు. రామాచార్లపల్లెలో ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, పోతబోలులో సర్పంచ్ ఈశ్వరయ్య, కొత్తవారిపల్లిలో సర్పంచ్ మహేష్, దుబ్బిగానిపల్లెలో సర్పంచ్ బుడ్డయ్య, మాలేపాడులో సర్పంచ్ గణేష్‌లు ఆయా పంచాయతీల సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు

తంబళ్లపల్లె: మండలంలో కన్నెమడుగు, ఎద్దులవారిపల్లె, కొటాల, ఆర్‌ఎన్ తాండా, జుంజురపెంట, బాలిరెడ్డిగారిపల్లె, కోసువారిపల్లె పంచాయతీలలో శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆజాదీకా అమృత్ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాదేశం-నా భూమి శిలాఫలకాలను ఆవిష్కరించారు. నేలతల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం పంచప్రాణ ప్రతిజ చేసి మొక్కలు నాటి నీరు పోశారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ కోరారు. పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా నిర్వహిస్తే మానవ మనుగడకు దోహద పడుతుందన్నారు. కార్యక్రమాలలో సర్పంచులు శ్యామలమ్మ, రెడ్డినారాయణ, సహదేవరెడ్డి, చెన్నకేశవరెడ్డి, భూదేవి, వేణుగోపాల్‌రెడ్డి, విజయలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యులు అప్పిరెడ్డి, శ్యామలమ్మ, రామక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, వాటర్‌షెడ్ చైర్మన్ లక్ష్మీరెడ్డి, రామశంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వీరులను స్మరించుకుందాం

పీలేరు : ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుందామని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పీలేరు, గూడరేవుపల్లె, రేగళ్లు, వేపులబైలు, బోడుమల్లువారిపల్లె గ్రామాల్లో నేలతల్లికి నమస్కారం.. వీరులకు వందనం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో నా భూమి - నా దేశం శిలాఫలకం ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీవో మహేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంచభూతాలను పరిరక్షించుకోవాలి

వాల్మీకిపురం: గాలి, నీరు, ఆకాశం, భూమి కలుషితం కాకుండా పరిరక్షించుకోవాలని జర్రావారిపల్లి, అయ్యవారిపల్లి సర్పంచ్‌లు మునిభాస్కర, జయచంద్ర అన్నారు. మన భూమి - మన దేశం కార్యక్రమంలో భాగంగా పంచ్‌ప్రాణ్ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచభూతాలను కలుషితం చేయడం వల్ల మానవాళి జీవనం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు కాలుష్య నివారణలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో సెక్రటరీ భారతమ్మ, నాయకులు గురుమూర్తి, విశ్వనాథ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో..

కలికిరి: ఆజాదీ కా అమృత్ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని గుట్టపాళెం, పత్తేగడ, గుండ్లూరు, పారపట్ల గ్రామాలలో ఘనంగా నా మట్టి - నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో శిలాఫలకాలు ఆవిష్కరించి, దేశభక్తి గీతాలను ఆలపించారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగులను సత్కరించారు. పత్తేగడలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐటీబీపీ, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ కేంద్రాల అధికారులు, జవాన్‌లు పాల్గొని జాతీయ జెండాలను ప్రదర్శించారు. కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, డిప్యూటీ కమాండెంట్‌లు పీటర్, ఎస్పీ నందన్వార్, సంజీవ్ ఒరా, కేవీ ప్రసాద్, నిలయప్పన్, అసిస్టెంట్ కమాండెంట్‌లు హనుమాన్‌రామ్, స్వామి, ఇన్‌స్పెక్టర్ మీనా, ఎంపీడీఓ గంగయ్య, ఏపీఓ సుజాత, ఎంఆర్సీ శంకర, మాజీ వైస్ ఎంపీపీ రామచంద్రారెడ్డి, కార్యదర్శులు గోపి, రెడ్డిప్రసాద్, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతృభూమికి సేవ చేయాలి

బి.కొత్తకోట: మాతృభూమికి ప్రతిఒక్కరూ సేవ చేయాలని ఎంపీడీఓ శంకరయ్య అన్నారు. మండలంలోని మొటుకుపల్లి, కోటావూరు పంచాయతీల్లో శుక్రవారం నా మట్టి-నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీల్లో మొక్కలు నాటి వాటి పెంపకంపై గ్రామస్తులు, ఉద్యోగులకు సూచనలు చేశారు. గ్రామాలకు చెందిన వ్యక్తులు సైన్యంలో పనిచేసి వీరమరణం పొందిన అమరులకు నివాళులర్పించారు. కోటావూరులో విద్యార్థులు జాతీయపతాలను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఎంపీపీ లక్ష్మినరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, సర్పంచులు సరస్వతమ్మ, ప్రమీల, ఎంపీటీసీ ఎ.గౌతమి, శివారెడ్డి, ఏపీఓ మంజుల, ఉప సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ పీట్ల.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకుందాం

కలకడ : నా భూమి-నా దేశాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపైన ఉందని జెడ్పీటీసీ సభ్యురాలు హారిక, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ శాంతమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని గంగాపురం, దేవులపల్లె, రాతిగుంటపల్లె, ముడియంవారిపల్లె పంచాయతీలలో ఏర్పాటు చేసిన నాభూమి-నాదేశం కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. అమర జవానుల ఆత్మశాంతికోసం మౌనం పాటించారు. మొక్కల పెంపకంపై శ్రద్ధ పెట్టాలని కోరారు. నేలతల్లి రుణం తీర్చుకుంటాం, ప్రకృతిని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. గ్రామ ప్రతిష్ఠను పెంచేవిదంగా నడుచుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రదీప్, ప్రకాష్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అంజన్‌కుమార్, గోవర్దన్, శ్రీనివాసులు, రెడ్డెప్పనాయుడు, శ్రీనివాసులునాయుడు, ఏపీఓ, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

సైనిక వీరుడు సాయితేజ సేవలకు సలాం



మిట్స్ కళాశాలలో సాయితేజ కుటుంబ సభ్యులకు సన్మానం చేస్తున్న దృశ్యం

కురబలకోట: నామట్టి - నాదేశం కార్యక్రమం గర్వకారణమని మండల తహసీల్దార్ ఎం. భీమేశ్వరావు పేర్కొన్నారు. శుక్రవారం అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ దేశ స్వతంత్ర్య యోధులు, త్యాగధనులు, ఆమర వీరులను గుర్తు చేసుకోవడం వారికి ఎనలేని గౌరవమన్నారు. దేశ త్రివిధ దళాధిపతి బిపిన్ రావత్ వ్యక్తిగత భద్రతా సిబ్బందిలో ఒకడిగా ఉంటూ తమిళనాడులో హెలిక్యాప్టర్ ప్రమాదంలో అమరుడైన మండలానికి చెందిన సైనిక వీరుడు సాయితేజను గుర్తు చేసుకున్నారు. సాయితేజను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అతని కుటుంబీకులను ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.



తంబళ్లపల్లె: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు



పీలేరు: మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

క్లుప్తంగా

13న వాహనాల వేలం

మదనపల్లె : పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన ద్విచక్రవాహనాలను కోర్టు అనుమతితో ఆదివారం స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేస్తున్నట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో రికార్డులు లేకుండా తిరుగుతున్న 38 వాహనాలను సీజ్ చేశామన్నారు. వాటిలో 34 ద్విచక్రవాహనాలు (స్క్రాప్) కింద, మిగిలిన 4 వాహనాలు రిజిస్ట్రేషన్ చేసుకుని నడుపుకునే వీలుందన్నారు. వీటికి ఆదివారం ఉదయం 10 గంటలకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో వేలం నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వ్యక్తులు డిపాజిట్ మొత్తాన్ని చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

నులి పురుగు నివారణతో రక్తహీనత దూరం

పెద్దతిప్పసముద్రం: నులి పురుగు నివారణతో రక్తహీనత దూరమవుతుందని కందుకూరు పీహెచ్‌సీ డాక్టర్లు శంకర్, అభిలాష్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా రెండు రోజుల వైద్య సిబ్బంది పీహెచ్‌సీ పరిధిలోని 2,143 మంది విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 922 మంది చిన్నారులకు అల్‌బెండోజోల్ మాత్రలు మింగించారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు

పెద్దతిప్పసముద్రం: మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ ఎగువ, దిగవ బండమీదపల్లి, బురదవారిపల్లిలో శుక్రవారం పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు దూర ప్రాంతాలకు వలసలు వెళ్ళిన వారు కూడా స్వగ్రామాలకు వచ్చి పీర్ల ఊరేగింపులో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపిక

మదనపల్లె సిటీ: రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు మదనపల్లె మండలం సిటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అబ్రార్ ఎంపిక య్యాడు. ఈనెల 12,13 తేదీల్లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే 6వ రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నాడు. విద్యార్థి అబ్రార్‌ను పాఠశాల హెచ్‌ఎం హృషికేశవ్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజ, నరేష్‌బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

పాలవెల్లువ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంకొండ: జగనన్న పాలవెల్లువ కేంద్రాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశులు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లోని 17 జగనన్న పాలవెల్లువ కేంద్రాలకు ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్రాల్లో పాల సేకరణ పనులను ప్రారంభించారు. పాడిరైతులు పాలు పోసిన మరుక్షణమే కంప్యూటర్‌లో వచ్చిన ఆన్‌లైన్ బిల్లులను వారికి అందజేశారు. . కార్యక్రమంలో ఏఓ నాగశివారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు విశ్వనాథ్, మణికుమార్, ఉదయ్, రాణీ, ప్రమీలా, కల్యాణి పాల్గొన్నారు.

వైభవంగా అక్కదేవతల ఉత్సవాలు

గుర్రంకొండ: మండలంలోని అమిలేపల్లె పంచాయతీ ఎగువ అమిలేపల్లెలో వెలిసిన అక్కదేవతల ఆలయంలో అమ్మవార్ల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవార్లకు గుర్రాలను మేళతాళాలతో గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త జీవన్‌కుమార్, అర్చకులు రాజుస్వామి పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

రామసముద్రం: మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో ప్రజల ఇంటి వద్దకే వైద్యసేవలు అందించే కార్యక్రమం చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారని డాక్టర్ సునీతకుమారి, సూపర్‌వైజర్ పద్మజ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వైద్యులే గ్రామాలకు వచ్చి రోగులకు చికిత్స చేసి, ఉచితంగా మందులు అందించారు. బీపీ, షుగర్, గర్భిణులు, బాలింతలు 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్స్ సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ఉమాదేవి, ఏఎన్‌ఎం గీతారాణి, డీఈవో సెల్వి, పైలట్ జానకిరామ్, ఆశావర్కర్స్ లక్ష్మీదేవి, భానుప్రియ, గౌతమి పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై మృత్యుంజయ హోమం

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయం ఎదుట శుక్రవారం హైదరాబాద్‌లో స్థిరపడిన తంబళ్లపల్లె వాసులు గణముక్కల సుబ్రమణ్యం, శిరీష దంపతులు మృత్యుంజయ హోమం నిర్వహించారు. వేదపండితులు పవన్‌కుమార్ శర్మ, పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు హోమాన్ని నిర్వహించారు. రుద్రాభిషేకం, నవగ్రహ, గణపతి, అష్టదిక్పాలక పూజలు నిర్వహించారు. భక్తులకు స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కొండకు వచ్చే మహిళా భక్తుల సౌకర్యార్థం రూ.40వేల ఖర్చుతో రెడిమేడ్ టాయిలెట్ గదిని ఏర్పాటు చేయడంతో ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, కొండకిట్ట, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, భక్తులు వారిని అభినందదించారు. గౌరమ్మగుట్టలో వెలసిన గౌరమ్మతల్లికి పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం సాయంత్రం అగ్రహారం పంచాయతీలోని బండమీద హరిజనవాడ, రెడ్డివారిపల్లె, అగ్రహారం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ ఉషారాణి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను పలుకరించారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను గ్రామస్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. స్థానికులు తాగునీటి పైప్‌లైన్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే స్థానిక సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా ముందుకెళుతోందన్నారు. ప్రజలు సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేరవేస్తున్నారన్నారు. జగనన్న పాలనను చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, ప్రభుత్వంపై బురద చల్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రజలకు మంచిచేయాలన్న లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు మరోసారి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రహ్మణ్యం, చంద్రాయుడు, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ కుసుమ, నాయకులు కైలాసపతి, దయాకర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, శశిధర్‌రెడ్డి, ఉదయ్‌శేఖర్‌రెడ్డి, సుధాకర, రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటరమణారెడ్డి, తహసీల్దార్ సీ.ఆర్. మంజుల, ఎంపీడీఓ శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : అర్హత కలిగిన ప్రతి కుటుంబం తలుపు తట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీ ఎగువకురవపల్లె, దిగువపాళ్యం, గుండావాండ్లపల్లె, ఆవులప్పగారిపల్లె, హరిజనవాడ, మొరంమీదపల్లె గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎగువకురవపల్లెలో మురుగనీటి కాలువలు, దిగువపాళ్యంలో విద్యుత్ స్తంభాలు, ఆరుగురికి పింఛన్లు, ఐదుగురికి ఇళ్లు, ఏడుగురు రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు వెంటనే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఆరు మాసాలకు అర్హత కలిగిన వారికి బియ్యం కార్డులు, పింఛన్ మంజూరు చేస్తున్నట్లు గుర్తు చేశారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేసి, అక్రమాలకు అవకాశం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో సంక్షేమ లబ్ధిని జమచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. సచివాలయ వ్యవస్థ ద్వారా మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి తెచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు హారిక, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయుడు, సర్పంచ్ మంజుల, కలికిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బరకం రవికుమార్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజనాయుడు, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథనాయుడు,రేఖానందంరెడ్డి, సిద్ధంనాయుడు, జీవీ కిషోర్, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పనుల పరిశీలన



స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌కు సంబంధించి పత్రాలను పరిశీలిస్తున్న మనోజ్‌కుమార్

మదనపల్లె : మండలంలోని సీటీఎం-1 పంచాయతీలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పర్యవేక్షకుడు మనోజ్‌కుమార్ అభివృద్ధి పనులను పరిశీలించారు. కేంద్రప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్(ఎస్ఎస్‌జీ) కార్యక్రమంలో భాగంగా బెస్ట్ పంచాయతీ అవార్డు ఎంపికకు సంబంధించి అన్నమయ్య జిల్లాలోని 25 పంచాయతీలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా సీటీఎం పంచాయతీలో సర్పంచ్ ఆనందపార్థసారథితో కలసి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, జెడ్పీహైస్కూల్, వారపు సంత, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, ఏఎస్‌ఎం, ఆలయాల నిర్వహణ తదితర అనేక అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్ మిషన్-గ్రామీణ్ ప్రజల ప్రవర్తనలో మార్పులు తెచ్చేందుకు నిర్దేశించిన ఉద్యమంగా తెలిపారు. మరుగుదొడ్ల వాడకం, సబ్బుతో చేతులు కడుక్కోవడం, కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయడం కార్యక్రమంలోని ప్రధాన అంశాలన్నారు. స్వచ్ఛభారత్ గ్రామీణ్ రెండోదశలో దేశంలోని మొత్తం ఆరులక్షల గ్రామాలను బహిరంగ మలవిసర్జనరహిత ప్లస్(ఓడీఎఫ్ ప్లస్)గా మార్చేందుకు కేంద్రప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని ఆదర్శంగా నిలపాలి

– మండల మీట్‌లో ఎంపీపీ బి. దస్తగిరి



మండల మీట్‌లో నాయకులు, అధికారులు

కురబలకోట: అధికారయంత్రాంగం, ప్రజాప్రతినిధులు కలసి కట్టుగా పని చేసి కురబలకోట మండలాన్ని ఆదర్శంగా నిలపాలని ఎంపీపీ బి. దస్తగిరి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో ప్రశాంతంగా మండల మీట్ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు వివరించారు. జెడ్పీటీసీ బైసాని జ్యోతి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మండల అభివృద్ధే ప్రథమ ధ్యేయంగా పనిచేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డి మండల అభివృద్ధికి ఏమి కావాలన్నా సహకారాన్ని అందజేస్తున్నారన్నారు. ప్రతి ఊరికి రోడ్లు ఆపై సచివాలయాలు, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లతో ఊర్లు కొత్తకళను సంతరించుకున్నాయన్నారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, అరుణమ్మ, ఎన్వీఆర్, భూదేవి, శివశంకర్‌రెడ్డి, యసాన్, ఎంపీడీఓ దిలీఫ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

బీటీ కాలేజీలో ముందస్తు స్వాతంత్ర్య సంబరాలు

మదనపల్లె సిటీ: బీటీ ప్రభుత్వ కాలేజీలో ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్థానిక బీటీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇండిపెండెన్స్ డే కమిటీ కన్వీనర్ నిర్మల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2010 నుంచి ప్రతి ఏడాది ముందస్తు స్వాతంత్ర్య సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా కారణంగా మూడు సంవత్సరాలు నిలిపివేయడం జరిగిందన్నారు. . బీటీ కాలేజీ లైబ్రరీ వద్దనున్న మైదానంలో 14న సాయంత్రం 7 నుంచి పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో సాహితి ప్రతిభ

మదనపల్లె సిటీ: జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పట్టణంలోని విజయభారతి పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని జె.సాహితీ ప్రతిభ కనబరిచారు. జార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన పోటీల్లో ఏపీ నుంచి 12 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో సాహితీ ఒకరు. ఏపీ బాస్కెట్‌బాల్ జట్టు ఏడో స్థానం నిలిచారన్నారు. సాహితీని పాఠశాల కరస్పాండెంట్ ఎన్.సేతు, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులకు రాయితీతో ఉలవలు

పీలేరు రూరల్ : రైతులకు 80 శాతం రాయితీలో ఉలవలు పంపిణీ చేయనున్నట్లు ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్ వేరుశనగ వేసుకోలేని రైతులు ప్రత్యామ్నాయ పంటగా ఉలవలు సాగు చేసుకోవచ్చునని తెలిపారు. ఉలవలు కావాల్సిన రైతులు తమ పేర్లను ఆర్‌బీకేలలో నమోదు చేసుకోవాలని కోరారు. పశు సంవర్ధక శాఖ అధికారి కె. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చాఫ్ కట్టర్స్ సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.